# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట


## ప్రజావాణికి 45 ఫిర్యాదులు

### అర్జీలను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణ పేట, జూన్ 16 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ లకు అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతన్న సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల కృషి

### - సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, రైతులు



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే, రైతులు

**వెల్దండ, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతన్న సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అనే విధాల కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతులతో ముఖాముఖి వీడియో కాన్ఫరెన్స్ పాల్గొని వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా బలోపేతమవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి అనేక నూతన ఆధునిక పద్ధతులు తీసుకొస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఈసీబీ మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, వెల్దండ గ్రామం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనిలా సంజీవ్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, పర్వత్ రెడ్డి, వ్యవసాయ అధికారిని శోభారాణి, మాజీ ఎంపీపీ జయప్రకాష్, జక్కుల చిన్న జంగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, కేశమల్ల కృష్ణ, పుల్లయ్య, రషీద్, అలీ, నారాయణ ఎర్ర శ్రీను ముదిరాజ్, రమేష్‌తోపాటు రైతులు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు పక్కా ఇల్లు : ఎమ్మెల్యే



ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

**బిజినపల్లి, జూన్ 16 ప్రభాతవార్త:** అర్హులందరికీ ఇందిరమ్మ రాజ్యంలో పక్కా ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. బిజినేపల్లి, కారుకొండ గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం దశలవారీగా ఇందిరమ్మ పథకం ద్వారా పేదలందరికీ ఇండ్లను అందజేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందరాదని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఎవరైనా అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు, వెంకట్ స్వామి అమృత్ రెడ్డి తిరుపతయ్య కత్తె ఈశ్వర్ బాలరాజ్ నరేందర్ గౌడ్ మల్లికార్జున్ రెడ్డి కృష్ణారెడ్డి పాషా నజీర్ ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి పాల్గొని ప్రజా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజావాణికి వచ్చే ప్రజా వినతులను అధికా రులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని నిజమైన లబ్ధిదారులను గుర్తించి పథకా ల ఫలాలను అందించేందుకు కృషి చేయాలి అన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, గృహజ్యోతి, లాంటి పథకాలలో అర్హులైన లబ్ధిదారులకు అందరికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



ఫిర్యాదుదారులతో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

### విద్యతో పాటు మన సంస్కృతి

# సంప్రదాయాలను పరిరక్షించాలి

- వైద్య కళాశాలలో సంస్కృతీ సంబురాలు
- ట్రెడిషనల్ డేలో పాల్గొన్న కలెక్టర్
- వైద్య విద్యార్థులతో నృత్యం చేసిన
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...



ట్రెడిషనల్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ సమీపంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన (ట్రెడిషనల్ డే) సాంప్రదాయ దినోత్సవ వేడుకలకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య కళాశాల వైద్య విద్యార్థులు సాంప్రదాయ బద్ధంగా దుస్తులను ధరించి, వివిధ రకాల సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించారు. పాటలు, నృత్యాలు, నాటికలు మరియు ఇతర సాంస్కృతిక ప్రదర్శనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు బాగా చదివి రాణించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అనేక చర్యలు చేపట్టిందని వాటిని అన్నిటిని సద్వినియోగం చేసుకొని, ఎంబిబిఎస్ పూర్తి చేసిన తర్వాత గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత ప్రతి వైద్య విద్యార్థిపై ఉంటుందని సూచించారు. పట్టణాలు, నగరాల్లో వైద్య సేవలు సులువుగా అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుంది. ఈ అసమానతలను తగ్గించడానికి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు సేవలందించడం ప్రతి ఒక్కరికి బాధ్యతను గుర్తు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. వైద్య వృత్తి అనేది కేవలం డబ్బు సంపాదనకు సంబంధించినది కాదు, అది ఒక సేవా వృత్తి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పవిత్రమైన బాధ్యత వైద్యులపై ఉంటుంది, బాధ్యతను గుర్తించి, అవసరమైన వారికి సేవ చేయాలని అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలన్నారు. వైద్య విద్యార్థులు తమ చదువులో రాణించడానికి, మంచి వైద్యులుగా మారడానికి అవసరమైన లక్షణాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. వైద్య విద్యార్థులు ఒత్తిడిని జయించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని కలెక్టర్ తెలిపారు. తాను కళాశాలలో విద్యార్థిగా చదువుకుంటున్న సమయంలో కళాశాలలో ఇలాంటి వేడుకలో పాల్గొని ఘనంగా జరుపుకున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. భారతీయ కలలు సంప్రదాయ నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కళాశాలల్లో సాంస్కృతిక దినోత్సవం, విద్యార్థులలో సాంస్కృతిక అవగాహన పెంపొందించడానికి మరియు వారి ప్రతిభను ప్రదర్శించడానికి ఒక అవకాశం లభిస్తుందని, తద్వారా వారికి చదువు పట్ల మరింత ఆసక్తిని పెంపొందిస్తుందని కలెక్టర్ తెలిపారు. వైద్య విద్య చాలా ఒత్తిడితో కూడిన విద్యాఅని అలాంటి వైద్య విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరప డతాయని ఆయన తెలిపారు. ఈ వేడుక ద్వారా, విద్యార్థులు తమ సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకోవడానికి, దానిని గౌరవించడానికి మరియు దానిని భవిష్యత్తు తరాలకు అందించడానికి ప్రేరణ పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, జిల్లా ఆసుపత్రి సూ పరింటెండెంట్ డాక్టర్ రఘు, నాగర్‌కర్నూల్ డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, వైద్య కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ట్రెడిషనల్ డేలో వైద్య విద్యార్థినులు

## లోక కల్యాణం కోసం మహాత్ములు పుడతారు

### - మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

### - కాళీ,ఉజ్జయిని పీఠాధిపతులను దర్శించుకున్న ఎమ్మెల్యే యెన్నం



ఉజ్జయిన పీఠాధిపతి నుంచి మెమెంటో అందుకున్న ఎమ్మెల్యే యెన్నం

**భూత్పూర్, జూన్ 16, ప్రభాతవార్త:** మహాత్ములు, పీఠాధిపతులు లోకకల్యాణం కోసమే పుడతారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిదిలోని ఏడోవార్డు సారిక టౌన్‌షిప్ వద్ద ఉన్న వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం, శ్రీమహాత్మా బసవేశ్వర జయంతోత్సవ కార్యక్రమంలో పీఠాధిపతులను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకుని, పఠాధీపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ పీఠాధిపతులు పాలమూరుకు రావడం అదృష్టంగా భావించాలని, వీరశైవ సంఘాల సభ్యులు, శివాభిమానులు, శివభక్తులు పీఠాధిపతుల ఆశీర్వాదాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, జెపీఎన్‌సీఈ సంస్థల చైర్మన్ కెఎస్ రవికుమార్‌తో పాటు జిల్లాల వీరశైవ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట:ఎమ్మెల్యే



ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అన్ని విధాల పాటుపడుతున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని బైరాపూర్ గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మర్రిగుంతతాండలో రూ.2కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యతమైన వైద్యం అందుబాటులోకి తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, వెల్దండ గ్రామం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్‌యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్రకాష్, గోపాల్‌రెడ్డి, జక్కుల చిన్నజంగయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, రషీద్, అలీ, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, రాజుయాదవ్, హరికిషన్, నారాయణ, రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, జూన్ 16ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య డైరీ డెవలప్మెంట్ క్రీడలు, శాఖమంత్రిగా డా.వాకిటిశ్రీహరి బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రఉపముఖ్యమంత్రివర్యులు పెద్దలు మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావుల సమక్షంలో పదవీ బాధ్యతలు వాకిటి శ్రీహరి మంత్రివర్యులుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం పదవి బాధ్యతలు చేపట్టిన గౌరవమంత్రివర్యులకు రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి వర్యులు, తుమ్మలనాగేశ్వరరావు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు పలు కార్పొరేషన్ల చైర్మన్లు పలు శాఖల అధికారులు తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ అభిమాన నాయకుడు మంత్రిగా పదవీ బాధ్యతలు చేపడుతున్న శుభ సందర్భంగా మక్తల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి రాష్ట్ర నలుమూలల నుండి ముదిరాజ్ బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.




బాధ్యతలు స్వీకరించిన మంత్రి డా.వాకిటి శ్రీహరి

## తెలంగాణ వాసులకు అండగా నిలువాలి

### అమెరికా న్యాయ నిపుణులకు డా. జిల్లెల చిన్నారెడ్డి సూచన

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త :** అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అమెరికాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ విద్యార్థులు, ఎన్ఆర్ఐలకు న్యాయపరంగా అండగా ఉం డాలని రాష్ట్ర ప్రణాళికా సం ఘం వైస్ చైర్మన్ డా. జిల్లెల చిన్నారెడ్డి అమెరికా న్యాయ నిపుణుల బృందానికి సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో టీపీసీసీ ప్రవాసి విభాగం కన్వీనర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా న్యాయ శాఖ ఆటార్నీలు జోషువా డాల్రైం ఫుల్, యహ్వా తాబిట్, సోమిరెడ్డి సంతోష్ రెడ్డి, విజయ్ ఎల్లారెడ్డి తో కూడిన న్యాయ నిపుణుల బృందం చిన్నారెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో నివాసం ఉంటున్న వారితోపాటు ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన విద్యార్థులు కూడా తీవ్ర భయాందోళనలతో ఉన్నారని అన్నారు. వారికి ఇమ్మిగ్రేషన్, వీసాలు, ఉద్యోగ అభద్రత, కార్పొరేట్ లీగల్ సపోర్ట్ అందించాలని చిన్నారెడ్డి అమెరికా న్యాయ నిపుణులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో న్యాయ సేవలు అందించే అమెరికా సంస్థ తెలంగాణలో తమ సేవలను ప్రారంభించడం రాష్ట్ర వాసులకు భరోసానిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల వీసా సమస్యలపై, అమెరికాలో వ్యాపారం చేయదలచిన సంస్థలకు న్యాయ సహాయం, లిటిగేషన్ సేవలు, విద్యార్థులకు యూఎస్ శిక్షణ అవకాశాలు - ఇవన్నీ హైదరాబాద్ నుంచే నిర్వహించేందుకు సోమిరెడ్డిలా గ్రూప్ సీ.ఈ.వో. సంతోష్ రెడ్డి గారి ముందుకు రావడం హర్షణియమని చిన్నారెడ్డి గారు అన్నారు. తెలంగాణను గ్లోబల్ లీగల్, టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది ఒక గొప్ప అడుగు అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అమెరికాలోని సోమిరెడ్డి లా గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో సోమిరెడ్డి సంతోష్ రెడ్డి ప్రతినిధి బృందం పాల్గొన్నారు.



అమెరికా న్యాయ నిపుణుల బృందంతో డాక్టర్ చిన్నారెడ్డి

## రైతు భరోసా చారిత్రాత్మక ఘట్టం



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, జూన్16 ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే పరమావధిగా భావించి అన్నదాతల ఖాతాల్లో ఏకకాలంలో రూ.9వేల కోట్లను జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఇది చరిత్రలోనే చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రైతు నేస్తం ప్రారంభ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1031 రైతు వేదికలలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేరుగా మాట్లాడడం ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న నిబద్ధతను చాటుతోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వనపర్తి మండలం నాగవరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, రాయితీపై పనిముట్లు, తుంపర సేద్యం పనిముట్లు, బిందు సేద్యం పనిముట్లు, రాయితీ విత్తనాలు, రాయితీ పంపుసెట్లు, అనేక పథకాల ద్వారా నేడు అన్నదాతలకు లబ్ధి చేకూరుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, పట్టణ మాజీ కౌన్సిలర్లు, వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

### - కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అదనపు కలెక్టర్లు, అధికారులు

### - ఉత్తమ పాలనకు ఏడాది మైలురాయి, కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు శుభాకాంక్షలు

### - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా జిల్లా అధికారులు సమిష్టిగా కలిసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలందరికీ పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు మరింత నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. తన ఏడాది పాలనలో తనదైన శైలితో ఉత్తమంగా.... ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ.. ప్రజలకు సేవలు అందిస్తున్న నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలోకి వేగంగా తీసుకెళ్లేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ పథకాలు ఎన్నో ఉన్నప్పటికీ, కొన్నిసార్లు అవి అర్హులకు చేరడంలో జాప్యం లేదా అవకతవకలు జరుగుతుంటాయి, ఈ సమస్యలను అధిగమించి, పథకాల లబ్ధి నిజమైన అర్హులను గుర్తించి అర్హులకే చేరేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాన్ని నెరవేర్చడానికి అత్యంత కీలకంగా జిల్లాస్థాయి అధికారులు వ్యవహరించాలన్నారు. పథకాల అమలులో పారదర్శకతను పాటిస్తూ, అధికారులు తమ విధులకు జవాబుదారీగా ఉండాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని, కేవలం కార్యాలయాల్లో కూర్చుని కాకుండా, క్షేత్ర స్థాయిలో పర్యటించి పథకాల అమలును పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా పరిష్కారాలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని కలెక్టర్ అన్నారు. కేవలం సంక్షేమ పథకాల అమలుతో ఆగకుండా, విద్య, ఆరోగ్యం, మౌళిక సదుపాయాలు, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులు తమ శాఖల పరిధిలో సమన్వయంతో పనిచేయడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. కేవలం ఉద్యోగం అనే కాకుండా, ప్రజలకు సేవ చేసే అవకాశం అనే దృక్పథంతో పనిచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా ప్రోత్సహించారు. ఒక సంవత్సరం కాలం జిల్లా అభివృద్ధికి తనతో కలిసి పనిచేసే అధికారులు అందరిని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు రామ్‌మోహన్ రావు, రమేష్‌కుమార్, సీతారాంనాయక్, స్వరాజ్యలక్ష్మి, రాజేశ్వరి, నాగేందర్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి

**నారాయణ పేట,జూన్ 16 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులకు సోమవారం నారాయణపేటలోని సివిఆర్ భవన్ లో నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం.పర్ణిక రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి.సలీం, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, సీనియర్ నాయకులు వకీల్ సంతోష్, సతీష్ గౌడ్, బోయ శరణప్ప,పట్టణ మహిళా అధ్యక్షురాలుశారద,నాయకులు కుర్వ మనోజ్, యూసఫ్ తాజ్, వెంకు గౌడ్, బండి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కోరం మహేష్‌రెడ్డి

**నారాయణ పేట, జూన్16 ప్రభాతవార్త :** ఉట్కూ రు మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కోరం మహేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, క్రీడ, యువజనశాఖ మంత్రివర్యులుగా అధి కారికంగాపదవి బాధ్యతలు చేపట్టబోతున్న మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరినిసెక్రటేరియట్లోమర్యాదపూర్వకంగాకలిసిశాలువాతోసన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పాఠశాలకు బీరువాను అందజేసిన పూర్వ విద్యార్థులు



పాఠశాలకు బీరువాను అందజేసిన పూర్వ విద్యార్థులు

**నారాయణపేట టౌన్, జూన్ 16 ప్రభాతవార్త:** దామరగిద హైస్కూల్‌లో విద్యనభ్యసించిన 1999 ,2000 బ్యాచ్ యస్‌యస్‌సి పూర్వ విద్యార్థులు సోమవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొని కృతజ్ఞత పూర్వకంగా పాఠశాలకు బీరువాను అందజేశారు. పాఠశాలకు బీరువాను అందజేయడం పట్ల ఉపాధ్యాయ సిబ్బంది పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉట్కూరు నూతన ఎస్సైగా వి.రమేష్



**నారాయణ పేట, జూన్ 16 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉట్కూరు పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సై వి.రమేష్ సోమవారం పదవి బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఇతను ఇంతకుముందు నాగర్ కర్నూల్ జిల్లా విఆర్‌లో పనిచేస్తూ బదిలీపై ఉట్కూరు పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగింది. ఇంతకుముందు ఉట్కూరు ఎస్సైగా పనిచేస్తున్న ఎస్సై కృష్ణం రాజు నారాయణపేట విఆర్ కు బదిలీ కావడం జరిగింది. నూతన ఎస్సై వి. రమేష్ మాట్లాడుతూ ఉట్కూరు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని, మండల ప్రజలు సహకరించాలని ఎస్సై తెలిపారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్ననేరుగా పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న చెట్ల తీగలు



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని శాసన్ పల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. వర్షాలు విరివిగా కురుస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, ఇతర మొక్కల తీగలు ఏపుగా అల్లుకున్నాయి. ప్రజలు, కాలనీ వాసులు వివిధ పనుల నిమిత్తం ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే రాకపోకలు సాగిస్తున్నారు. మొక్కలకు విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదు. రోడ్డు సమీపాన హైటెన్షన్ వైర్లు మనిషిని తాకే ఎత్తులో ఉండటంతో అటువైపు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రెవెన్యూ సదస్సులో 32 దరఖాస్తులు



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు ఇస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, జూన్16 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణం పళ్ళబురుజు వద్ద సోమవారం రెవెన్యూ శాఖ ద్వారా భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 32 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ తెలిపారు. వచ్చినటువంటి దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు రెవెన్యూ గిర్ధవర్, ప్రతాపరెడ్డి , భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వేంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మినారాయణ, మాజీ అధ్యక్షులు మల్లప్ప యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పలకల పంపిణీ

**నారాయణపేట టౌన్, జూన్16 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం వితలాపూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల మాజీ చైర్మన్ మహమ్మద్ రఫీ ఒకటవ తరగతి, రెండవ తరగతి విద్యార్థులకు పలక పంపిణీ చేశారు. విద్యార్థులకు పలకలు పంపిణీ చేసిన పాఠశాల మాజీ చైర్మన్ మహమ్మద్ రఫీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలమురళి, జడ్పిహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆశన్న, పంచాయతీ కార్యదర్శి వై. కనకప్ప,పాఠశాలఉపాధ్యాయులు పాఠశాల చైర్మన్ జీడి అనిత తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూన్ 16 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన చదవులు చదవాలని ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట పట్టణంలోని స్థానిక గ్రౌండ్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లు అందజేశారు. అనంతరం విద్యార్థుల ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం అనేక సౌకర్యాలు కల్పించింద న్నారు. ప్రభుత్వం కల్పించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన చదవులు చదవాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజనం,దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాలు అందజేస్తుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠశాల సిబ్బందితో బాటు తదితరులు ఉన్నారు.

## ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యం

■డీఎస్పీ నల్లపు లింగయ్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ

**నారాయణపేట, జూన్ 16 ప్రభాతవార్త:** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా సోమవారం రోజు నారాయణపేట డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నల్లపు లింగయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 04 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం అందే విధంగా చూడడం జరుగుతోందని డీఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కి, పైఆఫీసులకి వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే నేరుగా వచ్చి ఫిర్యా దుకు సంబంధించిన విషయాలు తెలపాలని డీఎస్పీ తెలిపారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

■నారాయణ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



కలెక్టర్ కార్యాలయపు గదులను ప్రారంభిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, జూన్ 16 ప్రభాతవార్త :** సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం సమావేశం గది ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయపు గదులను మరియు పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సమావేశపు గది నిర్వహణ చాలా చక్కగా చేశారని జిల్లా డీఎంహెచ్ఓను ప్రశంసించడం జరిగింది. అలాగే ఈ జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ చాలా కీలకమైనదని అన్ని కార్యక్రమాలలో లక్ష్యాల పరంగా పురోగతి సాధించాలని కొత్తగా వచ్చిన ప్రోగ్రామ్ అధికారులు మరియు సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేసి వైద్య ఆరోగ్య శాఖకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె .జయచంద్ర మోహన్ మాట్లాడుతూ ఈ సమావేశపు గది నిర్వహణకు ప్రేరణ కలెక్టర్‌ని వారు అడిగిన వెంటనే స్పందించి జిల్లా పురోగతికి మరియు వైద్యశాఖ అభివృద్ధికి, సమావేశపు గది నిర్వహణకు పాటుపడడం చాలా గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శైలజ, డిపిఓ బిక్షపతి,సబ్ యూనిట్ అధికారి అశోక్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు విజయ్ కుమార్, గోవిందరాజు, ఫార్మసిస్ట్ సూర్య కాంత్ రెడ్డి, డిడిఎం రాఘవేందర్, మిగతా సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మాదకద్రవ్యాల నిషేధం అమలుకు పకడ్బందీ చర్యలు



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎస్పీ

**నారాయణ పేట, జూన్16 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధం అమలుకు పగడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు డిఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీనార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పి మాట్లాడారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో నమోదైన గంజాయి కేసులే తప్ప కొత్త కేసులేమి లేవని ఆయన చెప్పారు. తమ పోలీసు శాఖ తో పాటు రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఎక్సైజ్‌శాఖ, వైద్య శాఖ అధికారులు నిషేధం అమలుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. తమ శాఖ మాదకద్రవ్యాల నిషే ధంపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టామని స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జయ చంద్రమోహన్ మాట్లాడుతూ పోలీసు శాఖ నిర్వహించే అవగాహన కార్యక్రమాల గురించి తమకు సమాచారం ఇస్తే తమ శాఖ తరఫున వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొని ఆరోగ్య పరంగా సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. మాదకద్రవ్యాల నిషేదిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని, అందు కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలనీ ఈ సందర్భంగా ఆర్డీవో రామచందర్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మేఘా గాంధీ, కలెక్టరేట్ ఏవో జయసుధ, సీ సెక్షన్ అధికారులు రాణిదేవి, జిసి డిఓ నర్మద, డిఐఈఓ సుదర్శన్, బిక్షపతి, ఎక్సైజ్ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డి




రైతు నేస్తం కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పాల్గొన్న తహసీల్దార్, ఏఈఓలు

**ఇటిక్యాల, జూన్ 16 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు పెద్దపీట వేస్తుందని అన్ని రకాలుగా వ్యవసాయంలో రైతులను ఆదుకుంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి రైతులు పంట మార్పిడి చేపట్టి పంటల అధిక దిగుబడులు పొంది గిట్టుబాటు ధరలు కూడా పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. సోమవారం సాయంత్రం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో చేపట్టిన సంస్కరణలు అలాగే రైతు రుణమాఫీ. రైతు భరోసా. రైతు బీమా. 500 బోనస్. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్న వివరాలను రైతు నేస్తం ద్వారా రైతు వేదికలలో పాల్గొన్న లక్షలాది మంది రైతులకు వివరించారు. ఇదే సందర్భంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పెట్టుబడులు పెట్టుకునేందుకు రైతు భరోసా నిధుల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. నేటి నుండి తొమ్మిది రోజులపాటు సాగు భూమి ఎంత ఉన్న అలాంటి రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఇటిక్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో తాహసిల్దార్ వీరభద్రప్ప. పుట్టాం దొడ్డి రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్. వేముల రైతు వేదికలో ఎర్రవల్లి ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్‌ఖాన్. ధర్మవరం రైతు వేదికలో ఎర్రవల్లి తహసీల్దార్ నరేష్. చాగాపురం రైతు వేదికలో ఎంపీడీవో మహమ్మద్ అజార్ మొహియుద్దీన్, అలాగే సింగల్ విండో చైర్మన్ చైర్మన్ రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఏఈవోలు సంధ్యారాణి కవిత రాణి, సంధ్య, మండలంలోని ఆయా గ్రామాల ఏఈవోలు రైతులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మానవపాడు, జూన్ 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రైతులందరూ ఈ భూభారతి రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూభారతి చట్టంపై తహసిల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ అవగాహన కల్పించారు. గతంలో పరిష్కారం కానీ భూ సమస్యలపై రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.గ్రామంలో 73 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తాహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మానవపాడు, జూన్ 16 ప్రభాతవార్త :** ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 ,2000 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వ హించారు. 25 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు ఒకరినొకరు పలక రించుకుంటూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.తాము చదువుకున్న పాఠశా లకు గుర్తుగా పూర్వ విద్యార్థులంతా కలిసి బీరువాను అందజేశారు. అనంతరం ఫోటోలు దిగి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు.

## మహాత్మా బసవేశ్వరుడు అందిరికి ఆదర్శప్రాయుడు

-మహబూబ్‌నగర్ ఎంపీ డీకె అరుణ

**భూత్పూర్,జూన్ 16,ప్రభాతవార్త:** ఆధ్యాత్మిన ప్రభోదనలతో సమాజాన్ని మేల్కొల్పిన మహాత్మా బసవేశ్వరుడు అందరికి ఆదర్శప్రాయుడని మహబూబ్‌నగర్ ఎంపీ డీకె అరుణ అన్నారు.సోమవారం భూత్పూర్ మున్సిపాలిటీ ఏడోవార్డు సారిక టౌన్‌షిప్ వద్ద ఉన్న వాసవీ కల్యాణమండపంలో కాశీ,ఉజ్జయిని,శ్రీశైల మఠాధిపతులను ఎంపి డీకె అరుణ దర్శించుకున్నారు. పీఠాధిపతులను ఎంపి ఘనంగా సత్కరించి అనంతరం వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం సభికులనుద్దేశించి ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు లేకుండా చేయాలన్న బసవేశ్వరుడి కృషి ఎనలేనిదని పేర్కొన్నారు.కుల,మత భేదాలు లేకుండా అందరూ సమానమనే నినాదాన్ని మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.విశ్వగురువు శ్రీబసవేశ్వరుడి స్ఫూర్తితోనే ఈ దేశంలో ప్రధాని మోదీ పాలన సాగుతోందన్నారు.



పీఠాధిపతుల సన్మానసభలో మాట్లాడుతున్న ఎంపీ డీకె అరుణ

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణకి భూమి పూజ



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, జూన్ 16 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం గోపనపల్లి గ్రామంలో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గోపనపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాటం అనిత. అదేవిధంగా స్వప్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర స్పెషల్ ఆఫీసర్ బాలమణి, దేవరకద్ర మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి పరశురాం, గ్రామ పార్టీ అధ్యక్షులు కుమ్మరి రాంబాబు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల కుల గణన, జన గణన చేయాలి

**పెబ్బేరు, జూన్16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రకటన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వము ప్రకటనలు చేస్తూనే ఉంది. కానీ జనాభా దామాషా ప్రకారం రావలసిన బీసీల వాటా 42 శాతం ప్రకటించకుండా పక్కదారి పట్టిస్తే స్థానిక ఎన్నికలలో తగిన గుణపాఠం తప్పదని, వెంటనే బీసీల కుల గణనను, జన గణనను చేసి 42 శాతం చట్టబద్ధత చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి .వెంకటన్న గౌడ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

## ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, జూన్ 16 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామ వాస్తవ్యులు నిరుపేద కుటుంబానికి చెందిన కటిక కథల్ హుస్సేన్ కుమార్తె నిధ వివాహం సందర్భంగా ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరిన వెంటనే జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ వెంటనే స్పందించి జిఎంఆర్ ఆదేశానుసారం దేవరకద్ర శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే వివాహనికి హాజరై తన వంతు సోమవారం సహాయంగా ఆర్థిక సహాయం అందించి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో తుప్పుడు రవి,సాకలి వెంకటేష్, కురువ శివ యాదవ్,కుక్కల సాయిలు,నత్తి ఆంజనేయులు,సత్తి రెడ్డి, కుమ్మరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికలు

**మక్తల్, జూన్ 16 ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశం కొరకు మక్తల్ మండల స్థాయిలో ఈనెల 18న ఎంపికలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి అనిల్‌గౌడ్ తెలిపారు. 01.09.2016నుంచి 30.08.2017 మధ్యన జన్మించిన బాల బాలికలు ఈ పోటీలకు అర్హులని ఆయన తెలిపారు. మండలంలోని ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురను మాత్రమే పోటీలకు పంపాలని ఆయన తెలిపారు.మొత్తం తొమ్మిది క్రీడాంశాలలో నిర్వహించే ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయి ఎంపికలకు పంపడం జరుగుతుందన్నారు.మిగతా వివరాలకు విశ్రాంతపిఈటి బి. గోపాలంను సెల్ : 7702713139లో సంప్రదించాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ



విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్,జూన్16 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల్ కేంద్రంలోని తాటిపాముల గ్రామంలోని యూపీఎస్ స్కూల్ నందు మట్టితో తయారుచేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య పూలమాలలు వేసి అలంకరించడం జరిగింది. బడిబాటలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న విద్యార్థిని, విద్యార్థుల అందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు మధ్యాహ్నం భోజనం, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్‌లో విద్య బోధన అందించడం జరుగుతుందని కనుక ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేరిపించి ప్రభుత్వంఅందించే వసతులను అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వెంకటయ్య నాయుడు,ఎపిపిసి చైర్మన్ మాధవి, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేర్ మున్సిపల్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్

**పెబ్బేరు, జూన్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశముల మేరకు చేపట్టిన 100 రోజుల కార్యక్రమలలో భాగంగా సోమవారం రోజు చేపట్టిన పనులను సిడిఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ ఆకస్మిక తనిఖీలు చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో వందన ఫూట్ వేర్ దగ్గర మోరీల చెత్త తీయుట ను పర్యవేక్షించారు. అనంతరం కొత్తకోట రోడ్డు లో రోడ్డు పక్కన మొక్కలు నాటే కార్యక్రమంలోపాల్గొని మొక్కలు నాటి, 10వ వార్డులో మున్సిపల్ ఆటోల ద్వారా చెత్త సేకరణ, మైక్‌ల ప్రచారం చేయడానికి పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయంలో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి, పెబ్బేరు పట్టనాబివృద్ధికి స్టాఫ్,ప్రజలందరి సమిష్టికృషి అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, మేనేజర్ గణేష్ బాబు, మున్సిపల్ స్టాఫ్ పాల్గొనారు.

## శాశ్వత అన్నదాన నిధికి రూ.50వేలు విరాళం

**మల్దకల్ జూన్ 16, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శాశ్వత అన్నదాన నిధికి గాను గట్టు మండలం బోయలగూడం గ్రామానికి చెందిన కీర్తిశేషులు చంద్రశేఖర్ రెడ్డి శారదమ్మ స్మారకార్థం ఆయన కుమారుడు సురేందర్ రెడ్డిగారు సోమవారం రూ 50,000 దేవాలయానికి విరాళం అందజేశారు. అనంతరం దేవాలయంలో పూజలు నిర్వహించి దాతలకు దేవాలయ సిబ్బంది,అర్చకులు స్వామివారి శేష వస్త్రం, పుస్తకాన్ని బహుకరించారు.



కంకోల్ హాస్టల్‌ని తనిఖీ చేస్తున్న ఎస్సీ డెవలప్‌మెంట్ డిడి రమాదేవి

## కంకోల్ హాస్టల్‌ని ఎస్సీ కార్పొరేషన్ డిడి ఆకస్మిక తనిఖీ

**మునిపల్లి, జూన్ 16(ప్రభాతవార్త):** ఎస్సీ అభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు రమాదేవి సోమవారం మునిపల్లి మండలం కంకోల్ ఎస్సీ హాస్టల్‌ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు వండిపెడుతున్న వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూను హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పుస్తకాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. హాస్టల్ చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలకు చదువుపై ఆసక్తికలిగించుటకు శ్రద్ధవహించాలనన్నారు. హాస్టల్ వార్డెన్‌తో బాటు సిబ్బంది అందుబాటులో వుండాలని సూచించారు. హాస్టల్‌లో విధ్యార్థులను చేర్పించుటకు వార్డెన్ కృషి చేయాలన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన తొంట సురేష్



జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తొంట సురేష్

**కొండాపూర్, జూన్ 16 (ప్రభాతవార్త):** మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన తొంట సురేష్ కాంగ్రెస్ గూటికి చేరారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా తొంట సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే పలు అభివృద్ధి పనులు చేపట్టి తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిపిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి గురు రాజ్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 35 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

**-భూమి పూజ చేసి ప్రారంభించిన కార్పొరేటర్ పుష్ప**



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 16, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, జ్యోతినగర్ మధ్య రూ. 35 లక్షలతో నిర్మించే సిసిరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ పూజలు నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన బస్తీ దర్బార్‌లో అశోక్‌నగర్ కాలనీలో మజీద్ వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు పేర్కొన్నారని, కొత్త డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శేషరెడ్డి, కలీమ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ప్రమోద్‌గౌడ్, పవన్, పాండురంగారావు, సాంబశివరావు, వసంత్‌రెడ్డి, నర్సింహాచారి, శంకర్, మల్లయ్య,నిషాద్ పాల్గొన్నారు.

## ప్రీ-స్కూల్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ సింధూ



బిడిఎల్ కాలనీలో ప్రీ-స్కూల్‌ను ప్రారంభిస్తున్న సింధూఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 16, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని బిడిఎల్ కాలనీలో సోమవారం నూతనంగా ఏర్పాటుచేసిన ప్రీ-స్కూల్‌ను కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యాభ్యాసానికి చిన్నారుల తొలి అడుగులు ప్రీ-స్కూల్‌లోనే పునాదులు పడి ఆరంభం అవుతాయన్నారు. చిన్నారులు క్రమశిక్షణతో ఉండేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. ప్రీ-స్కూల్‌తో డివిజన్ పరిధిలోని విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ప్రీ-స్కూల్ యాజమాన్యం సురేష్, ప్రభాకర్, హరికృష్ణ, బిఆర్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణకాంత్, సర్కిల్ యూత్ అధ్యక్షుడు నరసింహ పాల్గొన్నారు.


**పాఠశాల తనిఖీ...**

**రామచంద్రాపురం, జూన్ 16, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలను సోమవారం కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శౌరీలు, ఉపాధ్యాయులు రాజకుమార్, విద్యార్థులు ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం

**-మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి**

**న్యాల్‌కల్, జూన్ 16, ప్రభాతవార్త:** పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాకారం అవుతోందని జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గణేష్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మఇళ్ల లబ్ధిదారులకు తిరుపతిరెడ్డి మంజూరు పత్రాలు అందజేసి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గతంలోనే పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సొంతిళ్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు అశోక్, నాయకులు బలరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విఠల్, ఇందిరమ్మ కమిటి సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

# ఆర్టీసీ బస్సులు నడపాలంటూ విద్యార్థుల ధర్నా

**నర్సాపూర్, జూన్ 16, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లిలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి సోమవారం నర్సాపూర్‌లోని బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. జక్కపల్లి మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సులో నడపాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జక్కపల్లి మోడల్ స్కూల్‌కు మూడు బస్సులను నడిపేవారని దీంతో విద్యార్థులకు ఎంతోసౌకర్యం ఉండేదన్నారు. కాగా ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఒక్క ఆర్టీసీ బస్సు మోడల్ స్కూల్ నడకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్కూల్‌కు సమయానికి వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదని దీంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జక్కపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం మూడు ఆర్టీసీ బస్సులను నడిపించాలని డిమాండ్‌చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నర్సాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిరసనకారులను సముదాయించి ఆర్టీసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆర్టీసీ బస్సులను నడుపుతారని హామీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ధర్నాను విరమించారు. ఆర్టీసి అధికారులు ఇచ్చిన మాట ప్రకారం బస్సులను నడపాలని, ఒకవేళ నడపక పోతే ఈ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు వారి తల్లిదండ్రులు హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

## పుల్‌కల్ ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా దస్తయ్య

**పుల్‌కల్, జూన్ 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహం వార్డెన్‌గా జె.దస్తయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు వార్డెన్‌గా విధులు నిర్వహించిన మాణయ్య హత్నూర మండలంలోని తుర్కల ఖానాపూర్ ఎస్సీ హాస్టల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా దస్తయ్య మాట్లాడుతూ వసతిగృహంలో ప్రవేశం పొందేందుకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వసతి గృహంలోని విద్యార్థులకు 4 జతల దుస్తులు,బెడ్ షీట్, నోటు బుక్స్, స్టడీ మెటీరియల్, నెల వారి సబ్బుల బిల్లులు, స్వెటర్లు, స్కూల్ బ్యాగ్‌లు, స్కూల్ షూస్, స్పోర్ట్ షూస్, మంకీ క్యాప్, సాక్సులు అందిస్తామన్నారు. 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఇద్యార్థులకు 175 రూపాయలను కాస్మోటిక్ బిల్లు, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు 275 రూపాయల కాస్మోటిక్ బిల్లులను అందచేస్తున్నామన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ట్యూషన్ చెప్పించడం జరుగుతుందన్నారు. పుల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లకు వెళ్లి ప్రచారం చేసినట్లు వార్డెన్ దస్తయ్య వివరించారు.

## ఇందిరమ్మ రాజ్యం ఇంటింటి సౌభాగ్యం



లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ అందచేస్తున్న శివప్పగారి మాధవి శ్రీశైలం

**కొల్చారం, జూన్ 16, ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరుతుందని తుక్కాపూర్ మాజీ సర్పంచ్ శివప్పగారి మాధవిశ్రీశైలం అన్నారు. తుక్కాపూర్‌లో సోమవారం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ప్రొసీడింగ్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ లబ్దిదారులు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. తుక్కాపూర్ గ్రామ అభివృద్ధి నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో చేస్తామన్నారు. కార్యక్రమంలో రవీందర్, ఆంజనేయులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## భూభారతిని సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్

**కొల్చారం, జూన్ 16, ప్రభాతవార్త:** రైతులు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. సోమవారం చిన్న ఘనపూర్‌లో భూ భారతి గ్రామసభను నిర్వహించారు. సభకు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని 65 ధరఖాస్తులను అందచేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ గతంలో రైతులు భూ సమస్యల పరిష్కారానికి వ్యయ ప్రయాసాలకు గురయ్యారని, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సమయాన్ని వృధా చేసుకున్నట్లు గుర్తుచేశారు. రైతులు నుంచి ధరఖాస్తులు స్వీకరించి రశీదులు అందచేస్తు న్నామని, దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, జూనియర్ సహాయకులు సాయిలు, అమరేశ్వరి, ప్రభాత్‌రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ షేకయ్య, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, జూన్ 16, ప్రభాతవార్త:** మండల పరిధి ఎస్ కొండాపూర్ గ్రామానికి చెందిన ల్యాగల బాబు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపి 5వేల రుపాయల ఆర్థిక సహాయం పంపగా బిఆర్ఎస్‌నాయకులు సోమవారం కుటుంబానికి అందించారు.

## అల్లాదుర్గం కళాశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

**అల్లాదుర్గం, జూన్ 16, ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు మంచి మార్కుల తో ఉత్తీర్ణులయి ప్రతిభ కనబర్చారు. సోమవారం ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల కావడంతో సప్లమెంటరీ పరీక్షలో ఇంప్లిమెంట్ రాసిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపిసిలో వి చందన 470 మార్కులకు 443, ఎండి రంష 435 మర్కులు, ఏ పూజిత 432 మర్కులు, బైపిసిలో 440 మార్కులకు పల్లవి 410 మార్కులు, కంచరి సామితి 409 మార్కులు, ఎన్ సౌమ్య 409 మార్కులు సాధించి కళాశాల టాపర్‌లుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## వర్షాకాలంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, జూన్ 16,ప్రభాతవార్త:** ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంలో భాగంగా నూతన సబ్ స్టేషన్‌తోపాటు.. 11 కోట్లతో ప్రతి గ్రామం, పట్టణం, డివిజన్ పరిధిలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధంచేసినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అధికారులతో సర్వేనిర్వహించి.. విద్యుత్ స్తంభాల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలతో పాటు తుప్పు పట్టిన స్తంభాలా స్థానంలో నూతన స్తంభాలు, వదులుగా ఉన్న వైర్ల స్థానంలో నూతన వైర్లు ఏర్పాటు చేసేందుకు పటాన్చెరు డివిజన్ పరిధిలో రెండు కోట్లు, ఇస్నాపూర్, కొల్లూరు సబ్ డివిజన్ పరిధిలో తొమ్మిది కోట్ల రూపాయలతో అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించడం జరుగుతుందని తెలిపారు. గత వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించి ప్రజల మన్ననలు పొందడం జరిగిందని తెలిపారు. వర్షాకాలంలోనూ ఇదేవిధంగా పనిచేయాలని సూచించారు. త్వరలో అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపురి కాలనీ, బీరంగూడ గోశాల, రామచంద్రపురం మండల పరిషత్ ఆవరణలో 15 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కెవి సబ్స్టేషన్ల ప్రారంభించనున్నట్లు తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీ, పోచారం గ్రామ పరిధిలో నూతన సబ్స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని.. త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. నూతన కాలనీలకు విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండడంతో పాటు.. ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పటాన్చెరు డిఈ భాస్కర్, ఏడీఈలు తులసి రామ్, సంజీవ్, దుర్గాప్రసాద్,నాగరాజు, మాధవరావు, ఏఈలు పాల్గొన్నారు.

## కళ్యాణ మండపం నిర్మించడం అభినందనీయం

**నర్సాపూర్ జూన్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలోగల పురాతన ఆలయం శ్రీగండబేరుండ లక్ష్మీ నరసింహస్వామి ఆల యంలో పేదలకు ఉపయోగపడే విధంగా జిబిఎన్ ఎలైట్ చైర్మన్ చంది శ్రీని వాస్‌గౌడ్ సొంత వ్యయంతో కళ్యాణ మండపాన్ని నిర్మించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్‌రెడ్డి, గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు అనురాధ, లెజెండ్ సోషల్ గ్రూప్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ వాసు పేర్కొన్నారు. సోమవారం లింగాపూర్‌లోగల అక్షయ్ ఫామ్‌లో జిపిఎన్ ఎలైట్ చైర్మన్ చంది శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో లెజెండ్ సోషల్ గ్రూప్‌తో కలిసి జిబిఎన్ ఎలైట్ సొసైటీ బిజినెస్ నెట్‌వర్క్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గ్రూపు ప్రతినిధులందరూ ముందుగా అక్షయ్‌ఫామ్ సమీపంలోనున్న శ్రీగండబేరుండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చంది శ్రీనివాస్ గౌడ్ నిర్మించిన కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. ఈ మేరకు నిరుపేద ల పిల్లల పెళ్లిళ్లకు ఈ కళ్యాణం మండపం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కళ్యాణం మండప నిర్మాణదాత చంద్ర శ్రీనివాస్ గౌడ్ చేసిన సామాజిక సేవను వారు మెచ్చుకున్నారు.. అనంతరం అక్షయ్ ఫామ్ హౌజ్ లో నిర్వహిస్తున్న జిపిఎన్ ఎలైట్ సొసైటీ బిజినెస్ నెట్వర్క్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిబిఎన్ ఎలైట్ సొసైటీ బిజినెస్ నెట్వర్క్‌లో చేరితే మంచి లాభాలు ఉంటాయన్నారు. అదేవిధంగా లెజెండ్ సోషల్ గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు సామాజిక కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జిపిఎన్ఎలైట్ సభ్యులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో భూసమస్యలు పరిష్కారం : ఆర్డీవో

**నర్సాపూర్, జూన్ 16, ప్రభాతవార్త:** భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్డీవో మహిపాల్ అన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం కాజీపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆర్డీవో మహిపాల్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న ఎటువంటి భూ సమస్యలుంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఉన్నతాధికారుల సమక్షంలో భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహిపాల్ తో పాటు మండల తహసిల్దార్ శ్రీనివాస్. ఆర్ఐ సిద్ధిరాం రెడ్డి, మాజీ సర్పంచ్ హేమలత మదన్మోహన్. గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**చిన్నశంకరంపేట, జూన్ 16,ప్రభాతవార్త:** ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి సాయి సింధూ ఒక ప్రకటనలో తెలిపారు. 17న (నేడు) ఎస్టీ గిరిజన బాలుర వసతి గృహం, 19వ తెదిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, 21న ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

# కెటిఆర్‌కు బిఆర్ఎస్ నేతల సంఘీభావం

**రామచంద్రాపురం, జూన్ 16, ప్రభాతవార్త:**

ఫార్ములా ఈ-కారు రేసు కేసులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఏసీబీ విచారణకు హాజరువుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనకు మద్దతుగా నాయకులు సోమవారం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి నియోజకవర్గ పార్టీ నాయకులతో కలసి తెలంగాణ భవన్‌కు చేరుకుని కేటిఆర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్యకురుమ, బిఆర్ఎస్ సర్కిల్ ప్రెసిడెంట్ పరమేశ్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు బూన్, నాయకులు జగన్నాథ్‌రెడ్డి సంపత్ గౌడ్, జైపాల్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ కుట్రలను ఎండగడతాం**

**గుమ్మడిదల జూన్16 (ప్రభాతవార్త) :** ఫార్ములా ఈ రేస్ కేసు విచారణలో భాగంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్)ను సోమవారం ఏసీబీ అధికారులు విచారించనున్న నేపథ్యంలో, ఆయనకు సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్ తెలంగాణ భవన్‌వద్ద మీడియాతో మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసే విధంగా 420 హామీలు, ఫేక్ డిక్లరేషన్లు ఇచ్చిందని, అసత్యాలు చెప్పి అధికారాన్ని కాజేసిందని విమర్శించారు. ఇప్పుడు ఆ మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. అయినా ఎన్ని కుట్రలు చేసినా, బిఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గదని, ప్రజల మద్దతుతో పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల సత్యనారాయణ, వాసు దేవరెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్ వద్ద చేరుకున్న రామచంద్రాపురం బిఆర్ఎస్ నేతలు



తెలంగాణ భవన్‌లో గుమ్మడిదల నాయకులు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

**కంగ్టి, జూన్ 16, ప్రభాతవార్త:** మండలపరిధిలోని రాజారామ్ తండాలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్దిదారులకు మాజీ సర్పంచ్ రాథోడ్ పల్లవి పర్శురామ్ మంజూరుపత్రాలు అందచేసి నిర్మాణానికి భూమి పూజనిర్వహించారు. తండాకు 15 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు మాజీ సర్పంచ్ రాథోడ్ పల్లవి పర్శురామ్ పేర్కొన్నారు. అధికారుల సూచనల మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని లబ్దిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు చవాన్ అనిత బాయి, రేషన్ డీలర్ రవీందర్, నాయకులు రాంకిషన్, గులాబ్‌సింగ్, బల్‌దేవ్, నాందేవ్, తండా వాసులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం

**సదాశివపేట, జూన్ 16, ప్రభాతవార్త:** పట్టణంలోని 20వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ కోట ప్రవీణ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ మాణెమ్మ నేతృత్వంలో అక్షర స్వరూపిణి సరస్వతి మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు ఆటపాటల ద్వార చదువు చెప్పడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రవీంద్ర నగర్ అంగన్‌వాడి టీచర్ నాయి కోటి సంగీత, చిన్నారుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫాం సాగుపై అవగాహన

**కంది, జూన్ 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఉద్యానశాఖ అధికారి శైలజ రైతులకు ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి శైలజ మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగుకు ప్రభుత్వం డ్రిప్‌కు ఎస్సి,ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ ఓసి రైతులకు 90 శాతం రాయితీతో అందుకోవచ్చన్నారు. రూ. 20 మొక్కను పొందవచ్చన్నారు. ఎకరాకు 57 మొక్కలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. రైతులు మల్చింగ్, పండ్ల తోటలు, యంత్రీకరణ కూరగాయల పందిరి రాయితీల గురించి వివరించారు. అర్హులైన రైతులు ధరఖాస్తులు అందచేసి సద్వినియోగం చేసుకోవాలని మండల రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ గౌడ్, గోద్రేజ్ కంపెనీ మేనేజర్ భరత్, ఏఈఓ లోహిత, సంగీత, రైతులు చంద్రయ్య, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు తీరనున్న కష్టాలు

**ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న రైతులు

**గుమ్మడిదల జూన్ 16(ప్రభాతవార్త) :** గుమ్మడిదల మున్సిపాలిటీ, మండల పరిధిలో కానుకుంట, గుమ్మడిదల, రైతువేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం ప్రారంభోత్సవ కార్యక్రమం లైవ్ ప్రోగ్రామ్ ద్వారా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చాక రైతులను ప్రతిక్షణం ఎన్నంటూ ఉంటూ వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ రైతును రాజు చేసే లక్ష్యంగా ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ మనోహర, గుమ్మడిదల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి శివకుమార్, ఏఈఓ ప్రణవి వ్యవసాయ డివిజన్ అధికారులు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కార్యక్రమాన్ని వీక్షించిన రైతులు

**కంగ్టి, జూన్ 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు గాజుల్‌పాడ్ గ్రామాల్లోని రైతువేదికల్లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీసీ కార్యక్రమాన్ని రైతులు, వ్యవసాయ అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరీస్‌పవార్ ఏఈఓ గీత, సరిఫ్, మాజీ ఎంపిపి అధ్యక్షులు మాదవ్‌రావుపాటిల్, రైతులు పాల్గొన్నారు.

**కరస్‌గుత్తిలో...**

**నాగల్‌గిద్ద, జూన్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీన్‌చారి, నాయకులు గుండేరావు పాటిల్, సచిన్ పాటిల్, అనిల్ పాటిల్, ఏఈఓలు వినయ్, స్రవంతి, మహిపాల్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం

**టేక్మాల్, జూన్ 16 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఏకదశ రుద్రము, పల్లకి సేవా, మాధవానంద స్వామి పాదపూజ, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి నెల స్వామివారికి కల్యాణోత్సవాన్ని జరిపిస్తుంటారు. అందులో భాగంగా సోమవారం పీఏసీఎస్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు యశ్వంత్‌రెడ్డి దంపతులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఉదయాన్నే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు, ఏకదశ రుద్రము నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం స్వామివారి నామ సంకీర్తనలతో పల్లకి సేవా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించి భక్తిపారవశ్యంతో తన్మయం చెందారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్వామివారి కల్యాణానికి విశిష్ట అథితులుగా మాధవానంద స్వామి విచ్చేశారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అనుగ్రహ సందేశాన్ని బోధించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమంత్‌రెడ్డికి సన్మానం

**గుమ్మడిదల జూన్ 16 (ప్రభాత వార్త) :** వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఎన్‌వి హనుమంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనందున హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రవీందర్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వివేకానంద మెమెంటో అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లా వాలీబాల్ క్రీడలకు పుట్టినిల్లుని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో వాలీబాల్ క్రీడాకారులను అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర జాతీయ స్థాయి వరకు రాణించే విధంగా తమ వంతు సహాయాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు. ఎన్ వి హనుమంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం వాలీబాల్ రాష్ట్ర అధ్యక్షులు గజ్జల రమేష్ బాబు సారథ్యంలో వాలీబాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యాన్నని ఇదంతా రాష్ట్ర అధ్యక్షులు గజ్జల రమేష్ బాబు ప్రత్యేక చొరవతోనే ఈ స్థాయికి చేరుకున్నట్లు గుర్తు చేశారు రాష్ట్రంలో వాలీబాల్ క్రీడాకారులకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ల తో పాటు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కూడా పనిచేస్తుందని తెలిపారు.



హనుమంత్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం